## క్లుప్తంగా

### 29న కలెక్టరేట్ ఎదుట ఆందోళన

**కడప వైఎస్ఆర్ సర్కిల్:** ఈ నెల 29న భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలని కలెక్టరేట్ ఎదుట నిర్వహిస్తున్న ఆందోళనను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరి కెసీ బాదుల్లా పేర్కొన్నారు. సోమవారం నగరంలోని రవీంద్ర నగర్ భవన నిర్మాణ కార్మికుల అడ్డా వద్ద ఆందోళనకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి లింగన్న, నరసింహులు, మున్నా, శ్రీనివాసులు పాల్గొన్నారు.

### వైద్య శిబిరం


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ సర్ఫరాజ్ అలీఖాన్

**కడప ఎడ్యుకేషన్:** కడప మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ పాలిటెక్నిక్ విద్యార్థులు ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంపులో భాగంగా ఇందిరానగర్‌లో సోమవారం ఉచిత మెడికల్ క్యాంపును నిర్వహించారు. ఈ మెడికల్ క్యాంపులో ప్రైమ్ ఆసుపత్రి ఎండీ సర్ఫరాజ్ అలీఖాన్ పాల్గొని రోగులకు వైద్య పరీక్షలను నిర్వహించి మందులను ఉచితంగా అందచేశారు. ఈ కార్యక్రమంలో మను ప్రిన్సిపాల్ డాక్టర్ అబ్దుల్ ముఖ్సిత్‌ఖాన్, ఖాన్ కా రిక్తా చైర్మన్ తారక్‌అలీ, ఆయూబ్, డాక్టర్ షేక్ మస్తాన్‌వల్లి, ఎన్ఎస్ఎస్ పోగ్రాం కోఆర్డినేటర్ మొహమ్మద్ సికిందర్ హుస్సేన్, మొహమ్మద్ ఖాజా మొయినుద్దీన్, ఒమర్ ఫరూక్, డాక్టర్ షోయబ్ పాల్గొన్నారు.

### 'ఆర్ఎంపీ'పై చర్యలు తీసుకోవాలి

**కడప రూరల్:** నిబంధనలకు విరుద్ధంగా వైద్య సేవలు అందిస్తున్న ఆర్ఎంపీపై చర్యలు తీసుకోవాలని ఏపీ బహుజన సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బాలఓబయ్య కోరారు. ఆ మేరకు సోమవారం స్థానిక జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ నాగరాజుకు వినతి పత్రం సమర్పించారు. అనంతరం బాలఓబయ్య మాట్లాడుతూ పెండ్లిమర్రి మండల పరిధిలో ఎలాంటి అర్హత లేకున్నా ఆర్ఎంపీగా చెప్పుకొనే ఒక వ్యక్తి నిబంధనలకు విరుద్ధంగా వైద్య సేవలు అందిస్తున్నారని అన్నారు. అధికారులు విచారణ చేపట్టి, వాస్తవాలను పరిశీలించి ఆ వ్యక్తిపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

### అంతర్జాతీయ సదస్సుకు ఆహ్వానం


డాక్టర్ జయరాజ్

**వైవీయూ :** వైవీయూ భూవిజ్ఞానశాస్త్ర విభాగం ఆచార్యులు డా. ఎస్. జయరాజ్‌కు అంతర్జాతీయ సదస్సులో పాల్గొనేందుకు ఆహ్వానం లభించింది. ఈనెల 26 నుంచి 28వ తేదీ వరకు దుబాయ్‌లో 'నీటి వనరుల నిర్వహణ మరియు స్థిరత్వం: శుష్క ప్రాంతాలకు పరిష్కారాలు' అన్న అంశంపై నిర్వహించనున్న సదస్సులో పాల్గొనేందుకు ఈయనకు ఆహ్వానం అందింది. ఈ సదస్సులో 'సెంటినల్ – ఐఏ ఎస్ఏఆర్ డాటాను పైథాన్ ద్వారా ఉపయోగించి భారతదేశంలోని ఆంధ్రప్రదేశ్ వరద మ్యాపింగ్ మరియు అంచనా : పర్యావరణ సమతుల్యత' అన్న అంశంపై ఈయన పత్ర సమర్పణ చేయనున్నారు.

### ఘన నివాళి


స్వామి దాస్ మృతదేహానికి నివాళి అర్పిస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాష

**కడప కార్పొరేషన్ :** వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వినోద్ కుమార్ తండ్రి చెప్పలి స్వామిదాస్ (87) మృతి చెందారు. రిమ్స్‌లో చికిత్స పొందుతూ సోమవారం ఉదయం 7.30 గంటలకు ఆయన కన్నుమూశారు. బుడ్డాయపల్లెలోని వారి స్వగృహంలో స్వామి దాస్ మృతదేహం వద్ద పూలమాలలు ఉంచి డిప్యూటీ సీఎం అంజద్‌బాష, పలువురు కార్పొరేటర్లు నివాళులర్పించారు. మంగళవారం ఉదయం 8.30 గంటలకు అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు బంధుమిత్రులు తెలిపారు.

### ఏసీబీ డీఎస్పీగా గిరిధర్ బాధ్యతలు

**కడప అర్బన్:** అవినీతి నిరోధక శాఖ కడప డీఎస్పీగా గిరిధర్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. 1995 బ్యాచ్‌లో ఎస్ఐగా పోలీసుశాఖలో చేరిన ఆయన పలు పోలీస్‌స్టేషన్‌లలో విధులను నిర్వహించారు. సీఐగా, డీఎస్పీగా పనిచేశారు. తిరుపతిలో ఎస్.బి డీఎస్పీగా పనిచేస్తున్న గిరిధర్‌ను ఇటీవల బదిలీలలో కడప ఏసీబీ డీఎస్పీగా నియమించారు.

### 16న జాతీయ లోక్ అదాలత్

**కడప అర్బన్:** జాతీయ లోక్ అదాలత్‌ను మార్చి 9న (రెండవ శనివారం) జరుగవలసి వుండగా మహాశివరాత్రి, ప్రభుత్వ సెలవుల కారణంగా మార్చి 16 (మూడవ శనివారం)కు వాయిదా వేశారు. ఈ విషయాన్ని సోమవారం జిల్లా న్యాయసేవాధికారసంస్థ చైర్మన్, ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీదేవి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్. బాబా ఫకృద్దీన్‌లు ఒక ప్రకటనలో తెలియజేశారు.

# కల్యాణ వైభోగమే..


భక్తులకు మాంగల్య దర్శనం చేయిస్తున్న అర్చకుడు

**కడప కల్చరల్ :** విజయదుర్గాదేవి ఆలయంలో సోమవారం శ్రీ విజయదుర్గ, మల్లికార్జునుల కల్యాణోత్సవాన్ని కమనీయంగా నిర్వహించారు. అమ్మవారు కడప నగరంలో కొలువుదీరిన రోజును పురస్కరించుకుని ఉదయం అమ్మవారి మూల విరాట్‌కు 25 కలశాలలోని పవిత్ర జలాలతో విశేష అభిషేకాలు, అలంకారం చేశారు. యాగశాలలో చండీ హోమం, ఆలయ మండపంలో నవావరణ శ్రీ చక్రార్చన తదితర పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీ మల్లికార్జునస్వామి, విజయదుర్గమ్మల ఉత్సవ మూర్తులను వధూవరులుగా అలంకరించి ప్రత్యేక వేదికపై కొలువుదీర్చారు. ఆలయ వ్యవస్థాపకులు సుధా మల్లికార్జునరావు, నిర్వాహకులు దుర్గాప్రసాద్, కుటుంబ సభ్యుల పర్యవేక్షణలో అర్చక బృందం కల్యాణ క్రతువును నిర్వహించింది. టీటీడీ కళాకారులు అమ్మవారి భక్తిగీతాలు ఆలపించారు. కల్యాణం అనంతరం రాత్రి గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. నగర వీధుల్లో పూల రథంపై స్వామి, అమ్మవార్లు భక్తులను కటాక్షించారు. విచిత్ర వేషధారణలు, బాణాసంచా వెలుగులు ఈ ఉత్సవంలో ప్రధాన ఆకర్షణలుగా నిలిచాయి.

# ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం చూపాలి


ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్

**కడప కార్పొరేషన్ :** ప్రజల సమస్యలకు సత్వర పరిష్కారం చూపాలని నగర పాలక సంస్థ కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్‌చంద్ తెలిపారు. సోమవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నగరంలో అనుమతి లేని బ్యానర్లు, ఫ్లెక్సీలను తొలగించాలని, చెత్త సేకరణ వంద శాతం చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో మొత్తం 64 అర్జీలు రాగా, ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి 15, టౌన్ ప్లానింగ్ 22, రెవెన్యూ 7, హెల్త్ విభాగం 4, సచివాలయాల విభాగం 4, ఎస్టాబ్లిష్‌మెంట్ 4, యూపీఏ విభాగం 5, తహసీల్దార్ 1, సీకే దిన్నె తహసీల్దార్ 1, విద్యాశాఖ 1, హౌసింగ్ 3 అర్జీలు వచ్చాయి. వీటిని సకాలంలో పరిష్కరించాలని ఆయన అధికారులను ఆదేశించారు.

**జీటీఎస్ పనులను త్వరగా పూర్తి చేయాలి**

నగరంలోని గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ల పనులను త్వరగా పూర్తి చేయాలని కమిషనర్ ప్రవీణ్‌చంద్ ఆదేశించారు. సోమవారం మార్నింగ్ విజిట్‌లో భాగంగా ఆయన పుట్లంపల్లె, ఇండస్ట్రియల్ ఎస్టేట్, ఉక్కాయపల్లె, వినాయకనగర్ గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్లను పరిశీలించారు. ప్రతి క్లాప్ వాహనం ప్రతిరోజు మూడు టిప్పులు తప్పనిసరిగా తిరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. తడి, పొడి చెత్తలను వేర్వేరుగా సేకరించాలని చూడాలన్నారు. ట్రాన్స్‌ఫర్ స్టేషన్ల చుట్టూ మొక్కలు నాటాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నగరపాలక, టౌన్‌ప్లానింగ్, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

### గ్యారేజీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తాం


మాట్లాడుతున్న ఈడీ గిడుగు వెంకటేశ్వరరావు

**కడప కోటిరెడ్డిసర్కిల్ :** ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని కడప జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిడుగు వెంకటేశ్వరరావు తెలిపారు. సోమవారం కడప ఆర్ఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో 52 డిపోల గ్యారేజీ సిబ్బందితో ఎంప్లాయిస్ యూనియన్ జోనల్ కార్యదర్శి రాజశేఖర్ ఆధ్వర్యంలో జోనల్ అధ్యక్షుడు కేకే కుమార్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈడీ మాట్లాడుతూ మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా పరికరాలను సరఫరా చేసేలా చూస్తామన్నారు. అలాగే ఆధునిక టెక్నాలజీలో శిక్షణ ఇచ్చేందుకు కూడా తగిన చర్యలు చేపడతామన్నారు. ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదర్‌రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవీ నరసయ్య మాట్లాడుతూ గ్యారేజీ సిబ్బంది ఖాళీలను భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈయూ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సుబ్రమణ్యంరాజు మాట్లాడుతూ ఆర్టీసీ అధికారులు కొంతమందికి ఇష్టానుసారంగా శిక్షలు విధిస్తున్నారని తమ దృష్టికి వచ్చిందన్నారు. అనంతరం డీపీటీఓ గోపాల్‌రెడ్డి, డిప్యూటీ సీఎంఈ పి.లక్ష్మిభాస్కర్‌లు మాట్లాడారు. ఈయూ రాష్ట్ర కార్యదర్శి నబీ రసూల్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగరాజు, రాష్ట్ర నాయకులు మజీద్, మురగమ్మ, రాధాకృష్ణ, జోనల్ కమిటీ సభ్యులు, ఎనిమిది జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు, 52 డిపోల గ్యారేజీ కమిటీ నాయకులు, నాన్ ఆపరేషన్ యూనిట్ల అధ్యక్ష, కార్యదర్శులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

### విద్యతోపాటు సమాజ వికాసం అవసరం


విద్యార్థికి సర్టిఫికెట్‌ను అందజేస్తున్న చైర్మన్ శివశంకర్‌రెడ్డి, డైరెక్టర్ శ్రీదేవి

**కడప ఎడ్యుకేషన్:** నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులకు విద్యావికాసంతోపాటు సమాజ వికాసం కూడా ఎంతో అవసరం అని నాగార్జున విద్యాసంస్థల చైర్మన్ శివశంకర్ రెడ్డి, డైరెక్టర్ శ్రీదేవి అన్నారు. సోమవారం కడప నగర శివార్లలోని రామరాజుపల్లె నాగార్జున మోడల్ స్కూల్ బ్రాంచ్‌లో వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడానికి ఇలాంటి వార్షికోత్సవాలు కృషి చేస్తాయన్నారు. అనంతరం బచ్‌పన్ ప్లే స్కూల్లో కిండర్‌గార్టెన్ పూర్తి చేసుకున్న చిన్నారులకు చైర్మెన్, డైరెక్టర్‌లు కాన్వొకేషన్ పట్టాలు అందచేసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే వివిధ క్రీడల్లో ప్రతిభ చాటిన చిన్నారులకు కూడా జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలను అందచేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ కృష్ణవేణి, అరుణ, హెచ్‌ఎం వీరశివ పాల్గొన్నారు.

### మహిళల సాధికారతకు ప్రాధాన్యత ఇవ్వాలి


విద్యార్థినులతో ప్రిన్సిపాల్, అధ్యాపకులు

**వైవీయూ :** మహిళా సాధికారత సాధించేలా అన్ని రంగాల్లో ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. వేమల సలీంబాషా పేర్కొన్నారు. సోమవారం కడప నగరంలోని కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని ముందస్తుగా వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రపంచంలో ఎందరో మహిళలు చక్కటి విజయాలు సాధించారని, వారిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ముఖ్యవక్తగా విచ్చేసిన ట్రావెల్ మానియా హెచ్‌ఆర్ అనూహ్య మాట్లాడుతూ మహిళలు పనిచేసే ప్రాంతాలు, కార్యాలయాల్లో వ్యవహరించే తీరుపైన అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డా. గురుమోహన్‌రెడ్డి, డా. షాజియాబేగం, విద్యార్థినులు పాల్గొన్నారు.

# యువతే దేశానికి భవిష్యత్తు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఎం.వి. రామచంద్రారెడ్డి

**వైవీయూ :** యువతే దేశానికి భవిష్యత్తు అని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎం.వి. రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. సోమవారం కడప నగరంలోని నాగార్జున మహిళా డిగ్రీ కళాశాలలో జాతీయ సేవాపథకం ఆధ్వర్యంలో 'యువ సంవాద్–భారత్ 2047' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్సీ మాట్లాడుతూ దేశం యువత చేతుల్లోనే ఉందన్నారు. యువతే అన్ని రంగాల్లో ముందుండి నడిపించినప్పుడే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందన్నారు. వైవీయూ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా. ఎన్. వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ భారతదేశం విశ్వగురువుగా ఎదగడంలో యువత పాత్ర ఎంతో కీలకమన్నారు. ప్రధానమంత్రి నిర్దేశించిన పంచ ప్రాణ లక్ష్యాలను వివరించారు. 13వ డివిజన్ కార్పొరేటర్ రామలక్ష్మణ్‌రెడ్డి మాట్లాడుతూ యువత అన్ని రంగాల్లో రాణిస్తుండటం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా. కె. సూర్యనారాయణరెడ్డి, కరస్పాండెంట్ రామకృష్ణారెడ్డి, ఎన్ఎస్ఎస్ పీఓ సుబ్బనరసయ్య, డా. రాజగోపాల్, డా. కె. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను, కరాటే మాస్టర్‌ను అభినందిస్తున్న కరస్పాండెంట్ లెక్కల జోగిరామిరెడ్డి

**కడప ఎడ్యుకేషన్:** ఈ నెల 25వ తేదీ కదిరిలోని ఎస్ఎస్ స్పోర్ట్స్ అకాడమి అండ్ వారియర్స్ పోటోకాస్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 4వ నేషనల్ ఓపెన్ కరాటే చాంపియన్ షిప్ పోటీలలో కడప పవన్ కాన్సెప్ట్ స్కూల్ విద్యార్థులు ప్రతిభను చాటారు. ఈ పోటీలలో రాష్ట్రవ్యాప్తంగా 500 మంది విద్యార్థులు పాల్గొనగా ఇందులో పవన్ స్కూల్ విద్యార్థులు ప్రతిభను చాటి 10 గోల్డ్ మెడల్స్, 9 సిల్వర్ మెడల్స్, 3 బ్రాంజ్ మెడల్స్‌ను పొందినట్లు పాఠశాల కరస్పాండెంట్ లెక్కల జోగిరామిరెడ్డి తెలిపారు. 6 నుంచి 7 ఏళ్ల వయసుగల అమ్మాయిల విభాగంలో పాధిమ గోల్డ్ మెడల్‌ను, వర్షిత సిల్వర్ మెడల్ సాధించారు. అలాగే 8 నుంచి 9 ఏళ్ల విభాగంలో మనీషా గోల్డ్ , నయనిక సిల్వర్, 10 నుంచి 11 ఏళ్ల విభాగంలో మేఘన గోల్డ్, రాజ్యలక్ష్మి సిల్వర్, 12 నుంచి 13 ఏళ్ల విభాగంలో ఎంజెల్ గోల్డ్‌మెడల్‌ను సాధించినట్లు తెలిపారు. అబ్బాయిలలో 6 నుంచి 7 ఏళ్ల వయసు విభాగంలో సఫాన్ సిల్వర్ , గౌతం బ్రాంజ్ , 7 నుంచి 8 సంవత్సరాలకు సంబంధించి రిహాన్ బేగ్ సిల్వర్, మొహమ్మద్ ఉస్మాన్ బ్రాంజ్ మెడల్‌ను, 9 నుంచి 10 సంవత్సరాలకు సంబంధించి రేవంత్ గోల్డ్, రాఘవ మహీదర్ సిల్వర్, 10 నుంచి 11 సంవత్సరాలకు సంబంధించి దుర్గ హర్షవర్ధన్ గోల్డ్ , ఖైదీ సిల్వర్‌ను, 11 నుంచి 12 ఏళ్ల విభాగంలో ఖిజర్ గోల్డ్, యశ్వంత్‌కుమార్ సిల్వర్, 12 నుంచి 13 ఏళ్ల విభాగంలో మహియాఖన్ గోల్డ్, 13 నుంచి 14 సంవత్సరాల విభాగంలో రోహన్ గోల్డ్ మెడల్ సాధించారు. ఈ విద్యార్థులతోపాటు కరాటే కోచ్ విజయ్‌ను కరస్పాండెంట్ అభినందించారు.

# మద్దతు ధర అడిగితే రైతులను కాల్చి చంపుతారా?


కడపలో నిరసన ర్యాలీ చేపట్టిన రైతులు, పలు సంఘాల నాయకులు

**కడప వైఎస్ఆర్ సర్కిల్ :** తాము పండించిన అన్ని రకాల పంటలకు కనీస మద్దతు ధర కల్పించాలని రైతులు ఆందోళన చేస్తుంటే బీజేపీ ప్రభుత్వం కర్కశంగా పోలీసుల ద్వారా రైతులను కాల్చి చంపుతోందని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.ఈశ్వరయ్య విమర్శించారు. ఢిల్లీలో రైతులపై పోలీసుల కాల్పులకు నిరసనగా సోమవారం సీపీఐ కార్యాలయం నుంచి ఏడు రోడ్ల కూడలి వరకు ఎద్దుల బండ్లు, వ్యవసాయ ట్రాక్టర్లు, రైతులతో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల ఆదాయం రెట్టింపు చేస్తానని ప్రగల్భాలు పలికిన నరేంద్ర మోదీ ఇప్పటి వరకు కనీసం మద్దతు ధర కూడా ఇవ్వలేదన్నారు. దేశంలో వ్యవసాయం లాభదాయకంగా లేక అప్పుల బాధలతో లక్షల మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని ఆవేద వ్యక్తం చేశారు. వ్యవసాయాన్ని కార్పొరేట్ శక్తుల చేతుల్లో పెట్టేందుకు రైతులు, రైతు కూలీల పొట్ట కొట్టేందుకు బీజేపీ కుట్రలు చేస్తోందన్నారు. రైతులు పండించిన అన్ని రకాల పంటలకు కనీసం మద్దతు ధర, చట్టబద్ధత కల్పించాలని , వ్యవసాయ రుణాలు మాఫీ చేయాలని , భూ సేకరణ చట్టం 2013ను పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. దేశం బాగుండాలన్నా, రైతులు సుభిక్షంగా ఉండాలన్నా మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించాల్సిందే అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, సీపీఎం నాయకుడు దస్తగిరి రెడ్డి, బాబు భాయ్, జాకీర్, సుబ్బరాయుడు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బి.రామయ్య, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.నాగ సుబ్బారెడ్డి, సీపీఐ నగర కార్యదర్శి ఎన్. వెంకట శివ, బషీరున్నీసా, సుబ్రమణ్యం, విజయలక్ష్మి, పి.చంద్రశేఖర్, పి.సుబ్బరాయుడు, కేసీ బాదుల్లా పాల్గొన్నారు.

### జిల్లా హాకీ జట్టు ఎంపికలకు స్పందన


జిల్లా జట్టుకు ఎంపికైన హాకీ క్రీడాకారిణులు

**కడప స్పోర్ట్స్:** కడప నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ క్రీడాపాఠశాలలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన జిల్లాస్థాయి హాకీ సబ్‌జూనియర్, సీనియర్ విభాగం ఎంపికలకు క్రీడాకారిణుల నుంచి స్పందన లభించింది. ఈ ఎంపికలను హాకీ కడప అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎం. శేఖర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారులు మార్చి 8 నుంచి 10వ తేదీ వరకు ప్రకాశం జిల్లాలో నిర్వహించే ఆంధ్రప్రదేశ్ సీనియర్ ఉమన్ ఇంటర్ డిస్ట్రిక్ట్ హాకీ చాంపియన్‌షిప్‌లో పాల్గొనాల్సి ఉంటుందని తెలి పారు. అనంతరం ఎంపికలు నిర్వహించి జిల్లా జట్లను ఎంపిక చేశారు. కార్యక్రమంలో హాకీ కడప అసోసియేషన్ చైర్మన్ ఎ. శ్రీనివాసులు పాల్గొన్నారు.

# వలంటీర్ల సేవలు అమోఘం


పురస్కారాలు అందుకున్న వలంటీర్లతో ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి


వల్లూరులో వలంటీర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి, ఆర్టీసీ చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి

**కమలాపురం :** రాష్ట్రంలో వాలంటీర్లు అందిస్తున్న సేవలు అమోఘం అని, సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా స్థాపించిన వాలంటీర్ వ్యవస్థ వైపు దేశంలోని రాష్ట్రాలన్నీ చూస్తున్నాయని ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో ఏర్పాటుచేసిన 'వాలంటీర్లకు వందనం' కార్యక్రమంలో ప్రతిభ చూపిన వాలంటీర్లను సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్రల పురస్కారాలతో మెమెంటోలు, ప్రశంసా పత్రాలు అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఇంటి వద్దకే పాలన చేర్చాలనే ఉద్దేశంతో సీఎం వాలంటీర్ల వ్యవస్థకు అంకురార్పణ చేశారన్నారు. జగనన్న ఆశయాన్ని సాధించడంలో వలంటీర్లు కీలకపాత్ర పోషించారన్నారు. అందుకే ప్రతిభచూపిన ఒక సేవా వజ్రకు రూ.45 వేలు, ఐదుగురు సేవా రత్నలకు రూ.30 వేలు, మిగిలిన వారికి సేవా మిత్ర పేరిట రూ.15వేల నగదు పురస్కారం ఇచ్చారన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వాలంటీర్లు అందిస్తున్నారన్నారు. యువత ఉద్యోగాల్లో స్థిరపడే వరకు పనిచేస్తే వారిలో సేవా గుణం అలవడటంతోపాటు పెడదారిన పడకుండా ఉంటారన్నారు. స్టేట్ హార్టికల్చర్ అడ్వైజర్ సంబటూరు ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో జన్మభూమి కమిటీలు లంచం లేనిదే ఏ పథకం అందించేవారు కాదన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్తమారెడ్డి, రాజశేఖర్ రెడ్డి, సుబ్బారెడ్డి, పుల్లారెడ్డి, భారతి, సాదిక్, శ్రీనివాసరెడ్డి, హిదాయత్, అధికారులు నరసింహారెడ్డి, జ్యోతి, సుబ్రహ్మణ్యం, రాముడు, వలంటీర్లు పాల్గొన్నారు.

**పథకాలు అందించిన ఘనత వాలంటీర్లదే**

**వల్లూరు :** రాష్ట్రంలో అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించిన ఘనత వాలంటీర్లదేనని కమలాపురం ఎమ్మెల్యే పీ రవీంద్రనాథరెడ్డి, ఏపీఎస్ ఆర్టీసీ రాష్ట్ర చైర్మెన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. వల్లూరు మండల పరిషత్ కార్యాలయ సభా భవనంలో సోమవారం జరిగిన వలంటీర్లకు వందనం కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీల లంచగొండితనం, వివక్షతలను గమనించిన జగన్ పాదయాత్రలో ఇచ్చిన మాట మేరకు సీఎం అయిన వెంటనే గ్రామ సచివాలయ వ్యవస్థ, వలంటీర్ల వ్యవస్థలను అమలులోకి తీసుకొచ్చి ప్రజలకు పాలనను చేరువ చేశారని అన్నారు. కరోనా లాంటి కష్ట కాలంలో వలంటీర్లు సేవలు అందించడంతో రాష్ట్రంలో మరణాలు తక్కువగా నమోదయ్యాయని గుర్తుచేశారు. తమ ప్రభుత్వ పాలనలో మేలు జరిగిందని నమ్మితేనే మా పార్టీకి ఓట్లు వేయండని అడిగే దమ్మున్న ఏకైక నేత జగన్ అని కొనియాడారు. అనంతరం వలంటీర్లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జేసీఎస్ మండల కన్వీనర్ శంకర్‌రెడ్డి, వెంకట సుబ్బయ్య, క్రిష్ణారెడ్డి, శంకర్ రెడ్డి, శివకుమార్‌రెడ్డి, ఎంపీడీవో విజయ భాస్కర్, ఈవోపీఆర్‌డీ ప్రసాద్,ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వలంటీర్లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ వృత్తి నైపుణ్యం పెంచుకోవాలి



శిక్షణలో పాల్గొన్న పోలీసు సిబ్బంది

**కడప అర్బన్:** రానున్న ఎన్నికల నేపథ్యంలో ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ ఆదేశాల మేరకు ఇటీవల ప్రారంభమైన యాంటీ –రయట్ డ్రిల్ శిక్షణ ముమ్మరంగా కొనసాగుతోంది. నాలుగోరోజు సోమవారం సివిల్, స్పెషల్ పార్టీ పోలీస్ సిబ్బంది నూతనోత్సాహంతో శిక్షణలో పాల్గొన్నారు. ఏ.ఆర్. అదనపు ఎస్పీ ఎస్.ఎస్.ఎస్.వి కృష్ణారావు శిక్షణను పరిశీలించి హాజరైన పోలీస్ సిబ్బంది స్పందనను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వృత్తి నైపుణ్యం పెంచుకోవాలని సూచించారు. శాంతి భద్రతలకు విఘాతం కల్గించే, విధ్వంసానికి ప్రయత్నించే అల్లరి మూకలను ఉక్కుపాదంతో అణచివేసేందుకు ఇలాంటి శిక్షణా కార్యక్రమాలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. సోమవారం శిక్షణలో భాగంగా గ్యాస్‌గన్‌తో గ్యాస్ షెల్ వినియోగించే విధానం, వజ్ర వాహన వినియోగం, లాఠీ డ్రిల్ తదితర అంశాలపై తర్ఫీదు ఇచ్చారు. కార్యక్రమంలో ఏ.ఆర్. డీఎస్పీ మురళీధర్, ఆర్ఐలు ఆనంద్, వీరేష్, శివరాముడు, ఆర్ఎస్ఐలు, ఏఆర్ సివిల్, స్పెషల్ పార్టీ పోలీసులు పాల్గొన్నారు.

# వైభవం.. గంగమ్మ ఆలయ వార్షికోత్సవం


ప్రత్యేక పూజలందుకొన్న తలపనూరు గంగమ్మతల్లి


రాతి దూలాన్ని లాగుతున్న ఎద్దులు

**వీరపునాయునిపల్లె :** మండలంలోని తలపనూరు గంగమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం సోమవారం వైభవంగా జరిగింది. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు భక్తి శ్రద్ధలతో బోనాలలతో వచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. వీరపునాయునిపల్లె మండల ప్రజలేగాక, యర్రగుంట్ల, ప్రొద్దుటూరు, కమలాపురం మండలాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అమ్మవారికి భక్తులు సమర్పించిన పట్టు వస్త్రాలు వేలం వేయగా రూ.18వేల ఆదాయం వచ్చింది. భక్తులకు ఆలయ నిర్వాహకులు అన్నదానం ఏర్పాటుచేశారు.

**రసవత్తరంగా బండలాగుడు పోటీలు**

గంగమ్మ ఆలయ వారికోత్సవం సందర్భంగా ఆలయ నిర్వాహకులు సోమవారం ఏర్పాటు చేసిన బండలాగుడు పోటీలు రసవత్తరంగా సాగాయి. ఈ పోటీల్లో 18 జతల ఎద్దులు పాల్గొన్నాయి. భారీగా ప్రజలు తరలి రావడంతో ఎండ తీవ్రతకు గురికాకుండా పందిళ్లు, తాగునీరు, మజ్జిగ అందజేశారు. కర్నూలు జిల్లా రుద్రవరానికి చెందిన గోపాల్‌గౌడ్ ఎద్దులు ప్రథమ స్థానం, కడప జిల్లా దువ్వూరు మండలం దాసరిపల్లెకు చెందిన చిన్న వీరన్న యాదవ్ ఎద్దులు ద్వితీయ, కడప జిల్లా దువ్వూరు మండలం దాసరిపల్లెకు చెందిన బోగాది సుదర్శన్ ఎద్దులు తృతీయ, ఎకోడూరుకు చెందిన చాగంటి నాగమోహన్ రెడ్డి ఎద్దులు, రుద్రవరానికి చెందిన ఎద్దులు నాలుగు, ఐదో స్థానాల్లో నిలిచాయి. ఎద్దుల యజమానులకు పోటీల నిర్వాహకులు రూ.30వేలు, రూ.25 వేలు, రూ.20వేలు, రూ.15వేలు, రూ.10 వేలు వరుస బహుమతులుగా అందజేశారు.

### ఖైదీల సంక్షేమం కోసం కృషి


కడప కేంద్ర కారాగారంలో మాట్లాడుతున్న జడ్జి బాబా ఫకృద్దీన్

**కడప అర్బన్:** జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్. బాబా ఫకృద్దీన్ తమ సిబ్బందితో కలిసి కడపలోని కేంద్రకారాగారాన్ని, ప్రత్యేక మహిళా కారాగారంను సోమవారం సందర్శించారు. ఖైదీలలో సత్ప్రవర్తనతో వున్న పురుష ఖైదీలు, మహిళా ఖైదీలతో మాట్లాడి వారిలో అర్హులైన వారిని పారా లీగల్ వాలంటీర్‌లుగా నియమించారు. పారా లీగల్ వాలంటీర్‌ల ద్వారా లీగల్ ఎయిడ్ క్లినిక్‌లు పనిచేస్తాయి. ఈ క్లినిక్‌లలో పారా లీగల్ వాలంటీర్లు విధులు నిర్వర్తిస్తూ తోటి ఖైదీల సమస్యలు తెలుసుకుంటూ వారు ఏవైనా అర్జీలు సమర్పిస్తే వాటిని లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులకు ఇస్తారు. కేంద్రకారాగారంలో వున్న లీగల్ ఎయిడ్ క్లినిక్‌కు సందర్శించారు. కేంద్ర కారాగారంలో వున్న బీరువాల తయారీ ఫ్యాక్టరీని, బేకరీని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జైలు అధికారులు, ఖైదీలు పాల్గొన్నారు.